క్లుప్తంగా

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కంభం: కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పడిన వివాదానికి కారణమైన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెం రాజు ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సమస్యను పరిష్కరించేలా చూడాలని కోరుతూ ఎంపీడీఓ, స్థానిక ఎస్‌ఐలకు వాస్తవ పరిస్థితులు వివరించారు. బహుజన పరిరక్షణ సమితి నాయకులు దాసరి యోబు, ఎమ్మార్పీయస్ నాయకులు జయరాజ్, మనోజ్, ప్రభాకర్, ఏసు, సీపీఐ నాయకులు ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రేమించి మోసం చేసిన యువకుడి అరెస్టు

దర్శి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గర్నెపూడి పవన్‌కళ్యాణ్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామకృష్ణ గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని సీఐ రామకోటయ్య దర్శి ఆర్టీసీ బస్టాండు వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

పార్కింగ్ ప్రదేశాల పరిశీలన



పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పెద్దదోర్నాల: ఈ నెల 18వ తేదీన శ్రీశైలంలో మహాశివరాత్రి బహ్మోత్సవాల సందర్భంగా తరలివచ్చే భక్తులు వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు మండల కేంద్రంలో కేటాయించిన ప్రదేశాలను తహసీల్దార్ వేణుగోపాలరావు గురువారం పరిశీలించారు. స్థానిక శివసదనం, మల్లికార్జున నగర్, ఇస్కాన్ మందిరం తదితర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని, తాత్కాలిక మరుగుదొడ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి సూచనలిచ్చారు. ఆయన వెంట సర్వేయర్ సురేష్ ఉన్నారు.

శివరాత్రికి 35 ప్రత్యేక బస్సులు

- పొదిలి డిపో మేనేజర్ సుందరరావు



పొదిలి డిపో మేనేజర్ సుందరరావు

పొదిలి రూరల్: శివరాత్రి మహోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాలకు పొదిలి డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జె.సుందరరావు తెలిపారు. గురువారం పొదిలి ఆర్టీసీ డిపో డీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 18వ తేదీ ఉదయం 4 గంటలకు పొదిలి డిపో నుంచి శ్రీశైలానికి 20 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. దర్శి నుంచి పొదిలి మీదగా శ్రీశైలం మరో 5 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు స్పష్టం చేశారు. పొదిలి నుంచి రామతీర్థానికి 10 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పొదిలి డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం ఎండకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్తగా నీడ కోసం టెంట్లు, మంచినీటి వసతి సమకూర్చినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సుఖవంతమైన ప్రయాణం కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ సుందరరావు కోరారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ శివారులో కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ గురువారం తన సిబ్బందితో అకస్మికంగా దాడి చేశారు. దాడిలో పలువురు పరారయ్యారు. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక కోడి, రూ.15,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అతి పురాతనమైన ఆలయం పాతాళ నాగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలను ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక తన నివాసంలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాచర్ల మండలం ఆకవీడులో నూతనంగా నిర్మించబోయే షిరిడీ సాయిబాబా ఆలయం నిర్మాణానికి రూ.లక్ష ఎమ్మెల్యే అన్నా రాంబాబు తన సొంత నిధులు అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యేలం వెంకటేశ్వర్లు, నంద్యాల బాలసుబ్రహ్మణ్యం, పిడుగు శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్, శివాపురం ఆంజనేయులు పాల్గొన్నారు.

చతుర్ముఖ బ్రహ్మ అలంకారంలో స్వామివారు



పొదిలి రూరల్: ప్రత్యేక అలంకారంలో స్వామివారు



పెద్దదోర్నాల: ఇస్కాన్ ఆధ్వర్యంలో నల్లమలలో అన్నదానం చేస్తున్న దృశ్యం

పొదిలి రూరల్: మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలో జరుగుతున్న పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆరో రోజు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం హంస వాహనంపై చతుర్ముఖ బ్రహ్మ అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేక అలంకరణచేసి పొదిలి పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాత రావూరి బసవయ్య ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తులు, పాదయాత్రికులకు అన్నదానం

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వేళ్లే యాత్రికులు, శివభక్తులకు పలు ధార్మిక సంస్థలు అన్నదానంతోపాటు మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లను అందజేసి దాతృత్వం చాటుకుంటున్నాయి. పెద్దబొమ్మలాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో నల్లమల అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున అన్నదానం చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు డాక్టర్ చప్పళ్లి కనకదుర్గ, ఇస్కాన్ ప్రతినిధి అమలనిమయ్‌దాస్ తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో దేవతా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రోడ్డు షిరిడీ సాయిబాబా మందిరం ఆవరణలో భవాని రామలింగేశ్వర, సందీశ్వర, నవగ్రహ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పనారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రిటైర్డ్ డీఎస్పీ బాలాజీనాయక్, దండెబోయిన పెద్ద రమణ, సోమయ్య, లక్ష్మీరంగయ్య, ఎర్రారెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్తంగా

వైద్య పరీక్షలు

తాళ్లూరు: బొద్దికూరపాడు పంచాయతీ పరిధిలో గురువారం ఒంగోలు బెతూస్ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచి మందా శ్యామ్సన్, ఉప సర్పంచి పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్థో స్పెషలిస్ట్ సందీప్ ప్రకాశ్, గైనకాలజిస్ట్ స్వాతి, ఫిజియోథెరపిస్ట్ జితూలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెలుగొండ రాక

మార్కాపురం టౌన్: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ చెప్పారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామకృష్ణతో పాటు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేష్, ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ విల్సన్, రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ తదితరులు ఉదయం 11 గంటలకు పెద్దరావీడు మండలం సుంకేసులలో రైతులతో మాట్లాడతారన్నారు. సమావేశంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య, వీరారెడ్డి, ఎస్కే ఖాశీం పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

గిద్దలూరు రూరల్: గ్రామాల్లోని ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామాల్లోని పరిసరాల్లో డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో పురోగతి వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

ముండ్లమూరు: మండలంలోని ఈదర పొలాల్లో ఏర్పాటు చేసిన 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంపత్ కుమార్ తెలిపారు. గత నెలలో ఈదర పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి 18 కేజీల వైరును అపహరించుకుపోయారు. దీని విలువ రూ.16 వేలు ఉంటుందని విద్యుత్ ఏఈ ఖురాజు గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కష్టపడే మనస్తత్వం ఉండాలి

ముండ్లమూరు: విద్యార్థి దశ నుంచే కష్టపడే మనస్తత్వం కలిగి ఉండాలని హెచ్ఎం ఎల్.సుజాత అన్నారు. స్థానిక హైస్కూల్లో గురువారం పాఠశాల క్రీడా అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించిన వారిని సన్మానించారు. పీఈటీ భవన్నారాయణ, పూర్వ విద్యార్థి చీరాలకు చెందిన గుర్రం మురళి ఆట వస్తువుల కొనుగోలుకు ఎనిమిది వేలు, పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నరసింహారావు ఐదు వేలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తమ వంతు ఇతరులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. పీఈటి భవన్నారాయణ, ఉపాధ్యాయులు చక్రపాణి, బాబూరావు, నాగేశ్వరరావు, విజయనిర్మల, భారతి, జ్యోతి, ప్రభావతి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టుకు 300 మంది హాజరు

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులో ఛత్రపతి శివాజీ 2023 టాలెంట్ టెస్టుకు 300 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక కొమరోలు పబ్లిక్ స్కూల్లో 7, 8, 9 తరగతులు చదివే విద్యార్థులకు ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తూ ఆర్యమరాఠీ కాలనీకి తీసుకెళ్లి ప్రతిష్ఠించారు.

కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలి



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తాళ్లూరు: ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం పంచాయతీలకు మంజూరైన మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై కిట్స్ పంపిణీ చేశారు. మల్కాపురం, బెల్లంకొండవారిపాలెం సర్పంచ్‌లు వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ జీఎస్ ప్రభాకర్‌రెడ్డి, మురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఖ్యాతి

- కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంను పరిశీలించిన పీఎంఓ బృందం

పొదిలి రూరల్: నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుని జీవితంలో స్థిర పడాలంటే ఇంటర్మీడియెట్‌లో తీసుకోనే నిర్ణయాలే కీలకమని, మారుతున్న కాలానుగుణంగా తీర్చిదిద్దిన కోర్సులు, అసక్తి, అనుకూలమైన కోర్సులను ఎంపిక చేసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు అన్నారు. పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ స్వీయ పర్యవేక్షణలో అమలు జరుగుతున్న కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంను గురువారం పిఎంఓ ప్రత్యేక బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం ద్వారా అందుబాటులో ఉన్న కోర్సులపై అవగహన పెంచుకోవాలన్నారు. అప్పుడు ఇంటర్మీడియెట్ తర్వాత ఏయే కోర్సులు చేరవచ్చనే అంశంపై స్పష్టత వస్తుందన్నారు. ప్రస్తుతం విద్యార్హత ఉంటే చాలదని, నైపుణ్యం ముఖ్యమన్నారు. ఆ తర్వాత విద్యార్థులతో మమేకమయ్యారు. కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐఓ సైమాన్ విక్టర్, మాజీ డీఈఓ విజయభాస్కర్, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ తారావాణి పాల్గొన్నారు.

పొట్లపాడు రోడ్డుకు మోక్షం

- ఫలించిన జెడ్పీటీసీ కృషి

కురిచేడు: మండల కేంద్రం నుంచి గంగదొనకొండ వరకు రోడ్డు మరమ్మతులకు గుర్తైంది. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, ఆర్అండ్‌బీ అధికారులకు రోడ్డు గురించి వివరించారు. అత్యవసర మరమ్మతుల్లో భాగంగా కురిచేడు నుంచి గంగదొనకొండ వరకు సుమారు 50 లక్షల రూపాయలు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఆర్అండ్‌బీ అధికారులకు జెడ్పీటీసీ నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్యశాల ప్రారంభం

దొనకొండ: ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలను ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ గురువారం ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల్లో ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాలను ప్రారంభించటం గొప్ప విశేషమన్నారు. స్థానికులు ఎక్కువ మంది మార్కాపురం, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాల్లో కంటి వైద్యం చేయించుకునే వారన్నారు. ప్రస్తుతం దొనకొండలో కంటి వైద్యశాలను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోయాయన్నారు. ఈ అవకాశాన్ని దొనకొండలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ, సర్పంచ్ కోరారు. వైద్యులు ఎస్.జాకోబు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. రీజనల్ హెడ్ వాసుబాబు, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ మహేష్, శ్రీనివాస్, క్లస్టర్ కో ఆర్డినేటర్ దేవయ్య, టెక్నీషియన్ ఈశ్వరమ్మ, ఆప్టికల్ అసిస్టెంట్ శివకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ

- మృతుడి కుటుంబానికి రూ.50 వేలు, గాయపడిన బాధితులకు రూ 20 వేలు, రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి సురేష్

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం ఓదార్చారు. గాయపడిన వారిని ఆయన పరామర్శించారు. ఈ నెల 1వ తేదీన మండలంలోని గడ్డమీదిపల్లె గ్రామానికి చెందిన కూలీలు మిరప కోతల కోసం త్రిపురాంతకం మండలంలోని చెర్లోపల్లికి ఆటోలో వెళ్తూ ప్రమాదానికి గురై సుంకరి చిన్నశ్రీను మృతి చెందగా మరో 8 మంది గాయపడిన సంగతి తెలిసిందే. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్న మంత్రి.. గురువారం గడ్డమీదిపల్లెకు వెళ్లి మృతుడి కుటుంబంతోపాటు గాయపడిన వారిని పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబానికి రూ.50 వేలు, తీవ్రంగా గాయపడిన ఒక్కొక్కరికి రూ.20 వేలు, స్వల్ప గాయాలైన వారికి రూ.10 వేల ప్రకారం తన సొంత నిధులు అందజేస్తానని మంత్రి ప్రకటించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైస్ ఎంపీపీ మందుల ఆదిశేషు, మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జమీవుల్లా పాల్గొన్నారు.


ఇంటి పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఈఓఆర్డీ ఓబులేసు

ముండ్లమూరు: పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలుపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈఓఆర్డీ ఓబులేసు సూచించారు. మండలంలోని పులిపాడు సచివాలయంలో గురువారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పంచాయతీల్లో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పన్ను కట్టించారు. కార్యదర్శి రాజరాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



మార్కండేశ్వర స్వామి వారు



ఉత్సవాలకు సిద్ధమైన మార్కాపురంలోని శివాలయం



కంభం: యల్లమ్మ తల్లి మూలవిరాట్

మార్కాపురం: శివుడు సర్వంతర్యామి. మనసారా ఓం నమశ్శివాయ.. అంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. దేవతలు, రాక్షసులు ఆయన్ను పూజించారు. మార్కాపురం పరిధిలోని పలు శివాలయాలు శివరాత్రి పర్వదినానికి ముస్తాబయ్యాయి. అభిషేక ప్రియుడైన శివుడిని పూజిస్తే అన్ని కోరికలు నేరవేరుతాయని భక్తుల నమ్మకం.

మార్కండేయ మహర్షి ప్రతిష్ఠించిన లింగం

పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో (శివాలయం)లో ఏర్పాటు చేసిన శివలింగం మార్కండేయ మహర్షి ప్రతిష్ఠించినట్లు పురాణాల్లో ఉంది. మార్కండేయ మహర్షి గుండికా నదితీరాన తపస్సు చేసి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని సేవించిన అనంతరం ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు దేవాలయ చరిత్రలో ఉంది. ఈ మహర్షే రాజమండ్రిలో ఈశ్వరుని ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. 14, 15 శతాబ్దాల కాలంలో శ్రీకృష్ణ దేవరాయులు జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసినట్లు చరిత్ర ద్వార తెలుస్తోంది.

ఉత్సవాలు

మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ నెల 19న నంది వాహనంపై మహేశ్వరుని అలంకారం, 20న గజోత్సవంపై సార్వభౌమ అలంకారం, 21న రావాణసుర వాహనంపై నటరాజ శివతాండవం, 22న భృంగీశ్వర వాహనంపై జటాఝుట మహేశ్వర, 23న సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, 24న శివపార్వతుల అలంకారం, పూర్ణాహుతి సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం, 25న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, టెంపుల్ వాలి చెర్ల కేశవరావు తెలిపారు. వేములకోట శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దామసాని వెంకట్రామయ్య తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తిప్పయపాలెంలోని మునిశ్వరస్వామి ఆలయంలో కూడా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు జరిగాయి.

తర్లుపాడు: మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రంగా వీరాజిల్లుతున్న కేతగుడిపిలోని కేదారేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు వచ్చి రుద్రాభిషేకాలు, పూజలు చేస్తున్న దృష్ట్యా భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, పిచ్చయ శాస్త్రి తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకులు నాగరాజుశర్మ, రాముశర్మ, రాఘవశర్మ తెలిపారు. జగన్నాథపురంలో శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయంలో కూడా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు మంగళకుంట, ఓబాయపల్లి, తాడివారిపల్లి, తుమ్మలచెరువు గ్రామాల నుంచి భక్తులు వచ్చి పొంగళ్లు చేసుకుని స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారు. తర్లుపాడులోని శ్రీగంగాభవాని సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్త నెరేళ్ల కుమార్ తెలిపారు.

కంభం: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 18, 19, 20వ తేదీల్లో మండలంలోని తురిమెళ్లలో ఉన్న కనక సురభేశ్వరకోన, యల్లమ్మకోనలో ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు గోగులదిన్నె జయసింహారెడ్డి గురువారం తెలిపారు. అభిషేక దర్శనం, హోమం, రాత్రి నందివాహన ఉత్సవం, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు అన్నదానం ఉంటుందన్నారు.

చదువుపైనే దృష్టి పెట్టండి



భీమానాయక్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్లు రమేష్, కృష్ణారెడ్డి

మార్కాపురం టౌన్: ఇంటర్ విద్యార్థులు వచ్చే నెలలో జరిగే పరీక్షలను దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదవాలని సీఐ భీమానాయక్ సూచించారు. గురువారం స్థానిక శ్రీ సాధన జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాహుల్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. టెక్నాలజీని చదువు కోసమే వాడాలని, దుర్వినియోగం చేయవద్దని, జీవితంలో ఇంటర్ కీలకమన్నారు. భవిష్యత్తును నిర్దేశించేది ఇంటరేనని, సమయాన్ని వృథా చేయకుండా చదువుపైనే దృష్టి నిలపాలన్నారు. డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు. డైరెక్టర్ జీఎల్ రమేషబాబు, వీఆర్‌కే ప్రసాద్, ఎంవీ కృష్ణారెడ్డి, డి.రాజగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ 24 ఏళ్లుగా విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నామని, తమ వద్ద చదివిన విద్యార్థులు దేశంలోని వేర్వేరు ప్రాంతాలతో పాటు అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో కూడా ఉద్యోగాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం సీఐ భీమానాయక్, డాక్టర్ రాహుల్‌ను సన్మానించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ప్రిన్సిపాల్ శ్రీధర్

మార్కాపురం: స్థానిక ఏ-1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్ చెప్పారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఏడాదికి రూ. 4.20 లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, ప్రొఫెసర్లు అభినందించినట్లు చెప్పారు.